క్లుప్తంగా

## ‘బ్రహ్మకుమారీస్’ సేవలు అమోఘం



స్టేషన్ మహబూబ్‌నగర్: బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రపంచ శాంతిని కోరి చేస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ కేంద్రంలో ఆదివారం జరిగిన శివజయంతి, ధ్వజారోహణ ఉత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భగవంతుని నామస్మరణ పూర్వజన్మ సుకృతమని అన్నారు. మనిషికి నేటి యాంత్రికమైన జీవితానికి ప్రశాంతత అవసరమని అన్నారు. జీవితం పరమార్థం తెలుసుకోవడం ఎంతో ఆవశ్యమన్నారు. ఒక వ్యక్తికి ఉపకారం చేస్తే ఆ వ్యక్తికి మాత్రమే మేలు జరుగుతుందని, ఊరికి ఉపకారం చేస్తే గ్రామం మొత్తానికి అంతా మేలు జరుగుతుందన్నారు. తాను కూడా ఊరుకు ఉపకారం చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. అంతకుముందు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మకుమారీస్ సంస్థ తరఫున ఎమ్మెల్యేను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, బ్రహ్మకుమారీస్ సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మహాదేవి, గిరిజ, విఠల్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా బండలాగుడు పోటీలు

మిడ్జిల్: మండల పరిధిలోని వేములలో శివాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం బండలాగుడు పోటీలను నిర్వహించారు. జడ్చర్ల ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామీణా క్రీడలను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. పోటీల్లో 7 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతిని చర్లగార్లపహాడ్ రామాంజనేయులు గౌడ్, ద్వితీయ బహుమతి తాండూర్‌కు చెందిన సత్తయ్య, మూడో బహుమతి మల్దకల్‌కు చెందిన రాముడుకు చెందిన ఎద్దులు గెలుపొందాయి. ఈ సందర్భంగా సన్మానించి బహుమతి ప్రదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ విశ్వనందశర్మ, మాజీ సర్పంచ్ జంగయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ సమావేశం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్నారు. ఈ మేరకు వివరాలను బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్‌గౌడ్, బి.నరేందర్‌లు ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశం అనంతరం స్థానిక సంస్థల బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## ప్రీమియర్ లీగ్ బ్రోచర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: గోర్ బంజారా ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్లను జిల్లా కేంద్రంలో ఆదివారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆవిష్కరించారు. క్రికెట్ టోర్నమెంట్‌కు తన వంతు సహకారం ఉంటుందన్నారు. జీబీపీఎల్ స్పోర్ట్స్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ గోర్ బంజారా ప్రీమియర్‌లీగ్ సీజన్–7 ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందని, టోర్నీలో పాల్గొనే జట్లు 12వ తేదీ వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీసెల్ వైస్ చైర్మన్ ఆర్.శేఖర్ నాయక్, నాయకులు లింగంనాయక్, మోతీలాల్‌నాయక్, రాంచందర్‌నాయక్, రఘువీర్‌సింగ్, చందర్ రాథోడ్, చందర్ రాథోడ్, జీబీపీఎల్ టోర్నీ చైర్మన్ రామావత్ రవిరాథోడ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై అపస్మారకస్థితిలో మహిళ

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని మహిళ అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. బాధితురాలిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె ఎవరు...ఎక్కడి నుంచి వచ్చిందన్న వివరాలు తెలియరాలేదు.

## ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: మండలంలోని కాటవరం తండా గ్రామానికి చెందిన జర్పుల తుకారంకు సీఎం సహాయనిధి ద్వారా రూ.1.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎల్‌ఓసీని ఆదివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అందజేశారు. పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, జగదీశ్వర్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఊరూరా ‘ఉపాధి’ జోరు



గాధిర్యాల్ ఊర చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలు

- ఉమ్మడి మండలంలో పనిచేస్తున్న 2500 మందికి పైగా కూలీలు



కూలీలతో అధికారులు(ఫైల్)

మహమ్మదాబాద్: ఉమ్మడి మండల పరిధిలో ఉపాధి పనులు జోరందుకున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో పనులు సాగుతున్నాయి. చెరువుల పూడికతీత, కాల్వల మరమ్మతు లాంటి పనులు ఎంతో వేగంగా నడుస్తున్నాయి. ఉమ్మడి గండేడ్ మండల వ్యాప్తంగా 2500 మందికి పైగా కూలీలు పనులు చేస్తున్నారు. చెరువుల్లో పూడిక తీసి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. తద్వారా ట్రాక్టర్ల వారికి కూడా పని లభిస్తోంది.
ముఖ్యంగా వర్షాలు కురిశాక వచ్చే నీరు వృథాకాకుండా నిల్వఉంచేందుకు, ఫలితంగా భూగర్భ జలాలు పెంచుకొనేందుకు పనులు ఎంతో ఉపయోగపడనున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ఈనేపథ్యంలోనే చెరువుల్లో, కుంటల్లో, చెక్‌డ్యాంలలో పూడికతీత, గుట్టలు అడవీప్రాంతాల్లో వాలుకట్టలు, ట్రెంచ్‌లు, ఫారంఫాండ్ వ్యవసాయపొలాలకు ఒండ్రు మట్టి తదితరల పనులు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా ఉపాధి పనుల వల్ల ఎక్కడికో వలసపోవాల్సిన అవసరం ఉండని పేర్కొంటున్నారు. అయితే కార్యక్రమం జోరుగా సాగుతున్నప్పటికీ రెండు నెలలుగా కూలీలకు డబ్బులు అందడం లేదని.. సిబ్బంది సైతం అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు గమనించి చర్యలు తీసుకుని కూలీలకు, సిబ్బందికి వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కూలీపని బాగుంది

గ్రామాల్లో మాలాంటి నిరుపేదలకు కూలీ పనుల కోసం పట్టణాలకు వలసలుగా వెళ్లకుండా మా గ్రామాల్లోనే ఉపాధిద్వారా పనులు కలిపించడం ఎంతో బాగుంది. దీంతో మేము వలసలుగా వెళ్లకుండా నిత్యం పనులకు వెళుతూ వ్యవసాయ ఇంటిపనులు కూడా చూసుకోగల్గుతున్నాం. అయితే కూలీ డబ్బులు కూడా సకాలంలో అందిస్తే మాకు మేలు జరుగుతుంది.

– అనంతమ్మ, కొండాపూర్

### ‘ఉపాధి’తో మేలు

వేసవిలో చెరువుల్లో ఉపాధి ద్వారా పూడికతీత కోసం మట్టిని రైతులకు తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగించడం ద్వారా మాలాంటి వారికి మేలు జరుగుతోంది. రెండు మూడు నెలలపాటు ట్రాక్టర్లకు పని దొరుకుతుంది. ఆర్థికంగా కొంత ఇబ్బందులు తొలిగే అవకాశం ఉంది.

– వెంట్రాములు, ట్రాక్టర్ యజమాని, మహమ్మదాబాద్

### ఈ కేవైసీ చేయించుకోండి

ఉపాధిహామీ పనుల్లో చేస్తున్న కూలీలకు డబ్బులు కొంత ఆలస్యంగా వస్తున్నాయి. ఈ సమస్య అంతటా ఉంది. అయితే ఆలస్యం అయినా డబ్బులు మాత్రం తప్పకుండా వస్తాయి. డబ్బులు ఆగకుండా ప్రతీ కూలీ ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలి. ఎఫ్‌ఏలు వెంటనే అలాంటి వారిని గుర్తించి ఈకేవైసీ చేయించాలి.

– దేవన్న, ఎంపీడీఓ, గండేడ్

# లోక కల్యాణార్థం చండీహోమం



హారతి సమర్పిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: దేవునిగుట్టతండ సమీపంలో ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్య పురస్కరించుకుని ఆదివారం ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో చండీహోమం జరిపించారు. లోకకల్యాణార్థం ప్రతి అమావాస్యకు హోమం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పూజలు చేసిన అనంతరం హోమం నిర్వహించారు. హోమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, మయూరనాథ్, వేణుపటేల్, మహేష్‌యాదవ్, రమేష్‌యాదవ్, కిట్టు, కవిత, రమాదేవి, మానస, యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, పవన్, శ్రీధర్‌లు కూర్పొగా బుక్కనారాయణలతోపాటు భక్తులు పాల్గొన్నారు. హోమం పురస్కరించుకుని అన్నదానం చేశారు.

# ఘనంగా మల్లన్న జాతర



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: వెంకటాయపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా మైలారం మల్లన్న జాతర ఉత్సవాలు జరిగాయి. వేడుకలో భాగంగా పసుపు బండారీతో భక్తులు మునిగి తేలారు. గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. దేవాలయం నుంచి బయలు దేరి గ్రామం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతమ్మ నాయకులు కోన రాజశేఖర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నాయకులు పాల్గొని దేవాలయంలో పూజలు చేశారు.

## వైభవంగా నందికోళ్ల సేవ



గండేడ్: మహశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పలు దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం వెన్నాచేడ్, గండేడ్, పెద్దవార్వాల్ తదితర గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. గండేడ్‌లో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించి ఆదివారం తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించారు. పూజారి వెంకట రమణ సమక్షంలో శివనామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. అంతర్‌గంగా లింగేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో తెల్లవారు జామున అగ్నిగుండం, నందికోళ్ల సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

## కిటకిటలాడిన ఆలయాలు



గండేడ్: మండలపరిధిలో ఆదివారం అమవాస్య, శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయాలు కిటకిటలాడాయి. అంతర్‌గంగ లింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పగిడ్యాల్, వెన్నాచేడ్, లింగాయిపల్లి, గండేడ్, రెడ్డిపల్లి, మన్నూర్‌పల్లి, సల్కర్‌పేట్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉపవాసంతో ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్నానం చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వంటకాలు చేసి లింగేశ్వరుడికి నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేపట్టారు.

## ‘నారాయణ’ సేవలు మరువలేనివి



అడ్డాకుల: దివంగత ఎంపీపీ కందూర్ నారాయణ వర్ధంతిని అడ్డాకుల, కందూర్ గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు కందూర్ నారాయణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, విండో చైర్మన్‌గా కందూర్ నారాయణ చేసిన సేవలు మరువలేనిదని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమన్నయాదవ్, బీవీరాజు, శ్రీకాంత్, రమేష్, ఆజం, మున్నూర్ లక్ష్మయ్య, రామకృష్ణ, తోకల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

## మల్లురవికి టికెట్ ఇవ్వాలి

జడ్చర్ల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌స్థానానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవికి టికెట్ ఇవ్వాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు రాములు, వెంకటేశం, ప్రవీణ్, ఖయ్యూం, తదితరులు ఆదివారం పేర్కొన్నారు. మల్లురవికి అవకాశం ఇవ్వడం వల్ల గెలుపు సునాయసం అవుతుందని వివరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్‌లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. కాగా, ఈ కాలనీలో సగం వరకు మట్టిరోడ్లే ఉన్నాయని, కాల్వలు సరిగా లేక ఎక్కడికక్కడే మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను వీలైనంతవరకు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకుందాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని.. వంశీ చంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం దేవరకద్ర క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పార్లమెంట్ అభ్యర్థుల తొలి జాబితాలో మహబూబ్‌నగర్ స్థానానికి సంబంధించి టికెట్ పొందిన చల్లా వంశీచంద్‌రెడ్డి తొలిసారి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. కేంద్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని.. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. అందుకోసం నియోజకవర్గం నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

**ఎంపీగా ఆశీర్వాదించండి**

ప్రజల సమస్యలనే ప్రధాన అస్త్రంగా తీసుకుని నిత్యం ప్రజల్లోనే ఉండే నాయకున్ని ఎంపీగా ఎన్నుకోవాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని దీనికి గాను అందరు కాంగ్రెస్‌కే ఓటు వేసే విధంగా ప్రచారం చేయాలని కోరారు. మీ కోసం పని చేసే నాయకున్ని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, జగదీశ్వర్, నాగిరెడ్డి, కిషన్‌రావు, గోపాల్, అంజనేయులు, వెంకట్‌రెడ్డి, వర్మ, చంద్రమౌళి, వేణుగోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న ఎగ్గని నర్సింహులు

దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి బీజేపీని గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నర్సింహులు కోరారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని కొండ ప్రశాంత్‌రెడ్డి నివాసం వద్ద జరిగిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి రావాలని, మోదీ మరోసారి ప్రధాని కావాలని అన్నారు. ఇదే లక్ష్యంతో అందరు పని చేయాలని కోరారు. ఈ నెల 12 న ఎల్‌బీ స్టేడియంలో జరిగే బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశానికి అమిత్‌షా హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, కృష్ణంరాజు, నాగిరెడ్డి, సాయిరాజు, దేవన్నసాగర్, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, మాధవులు పాల్గొన్నారు.

# మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి



స్థానిక మహిళలతో అశ్లేషరెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి నిర్ణయాత్మక శక్తిగా నిలవాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషరెడ్డి అన్నారు. వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అశ్లేషరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, ఇంకా అణచివేతకు, అఘాయిత్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతూ ముందుకు వెళుతున్నారని అన్నారు. జిల్లా లింగబలిజ సంఘం మహిళా అధ్యక్షురాలు ఆవుటి నాగశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మి, శ్రావణి, విద్యుల్లత, అశ్విని, బండారి ఉమ, శ్రీదేవి, సుజాత, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: విధినిర్వహణలో బాధ్యతలు పోషిస్తూనే మహిళగా సమాజహితం కోసం కృషిచేద్దామని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు.



ప్రసంగిస్తున్న సునంద

ఆదివారం రాత్రి హౌజింగ్‌బోర్డు కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రఘురాం మాతృమూర్తి సునంద సహకారంతో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. రఘురాం, ప్రియాంకల కుమార్తె పాటను మెచ్చుకుని రూ. 2వేల నగదు బహుమతి అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ సారిక, మహిళలు సునంద, రజిత, నిర్మల, ప్రియాంక, రాజేశ్వరి, జీవమ్మ, డా.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వార్షికోత్సవం

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో ఆదివారం పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వన్‌టౌన్ సీఐ అప్పయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యక్షుడు సయ్యద్ రయాద్దీన్, కరస్పాండెంట్ సయ్యద్ ఫసియాద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోయిల్‌కొండ: మండలంలోని సూరారం ఉన్నత పాఠశాల (2011–12) పూర్వ విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా సురేష్, శ్రీశైలం, బాలయ్య, కవిత ఎన్నికయ్యారు.



# సావిత్రి బాయి ఆశయాలను కొనసాగిస్తాం



జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు



జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో..



జడ్చర్లలో..

సాక్షినెట్‌వర్క్: సావిత్రి బాయి పులే ఆశయాలను కొనసాగిస్తామని రజక రిజర్వేషన్ సమితి జాతీయ నాయకుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు క్యాతూర్‌శివన్న, నాయకులు నాగన్న, జిల్లా అధ్యక్షుడు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారంసత్యం పాల్గొన్నారు.
జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సావిత్రీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తాటి గణేశ్, కౌన్సిలర్‌లు శ్రీనివాసులు, రామ్‌లక్ష్మణ్, నరేందర్, నాయకులు సతీష్, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.
జడ్చర్లలో ఎమ్మార్సీ వద్ద సావిత్రిబాయి విగ్రహానికి జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, కౌన్సిలర్లు రఘురాంగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, లతలతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీసేన ఆధ్వర్యంలోనూ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు నర్సింహులు, లింగంపేట శేఖర్, గోపాల్, రామస్వామి, కట్ట మురళి, రాధాకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.